
# తరం - అంతరం

కొరుకొండ సత్యానంద్




రంగనాధంగారు వాలు కుర్చీలో కూర్చున్నారు....

ఆ గదిలో...ఆ కిటికీలోంచి బయటకు చూస్తుంటే చిక్కని చీకటిలోంచి నల్లని ఆకాశం, మిల మిలా మెరుస్తున్న నక్షత్రాలు కన్పిస్తున్నాయి...దూరంగా పెద్ద పెద్ద చెట్లు, వీస్తున్న గాలికి తల విరబూసుకున్న దెయ్యాల్లా ఊగుతున్నాయి ..రంగనాధంగారి మెదడులో ఆలోచనలు ఆగకుండా సాగిపోతున్నాయి.

సాయంత్రం....ఆఫీసులో అతనికి ఘనమ్మైన సన్మానం జరిగింది. ఖరీదైన శాలువా కప్పి, రక రకాల పూలతో ప్రత్యేకంగా తయారు చేసిన పెద్ద దండను వేసి, అందరూ ఎన్నో రకాలుగా అతన్ని పొగిడారు.

కష్టాలు, బాధలు, బాంధవ్యాలు అంటే ఏమిటో తెలియనట్లుగా ఉండే కుర్రకారు యల్డీసీలు కూడా గంభీరంగా, బాధగా, బరువుగా మాట్లాడారు.... వాళ్ళలా మాట్లాడగా వినడం అదే మొదటిసారి రంగనాధంగారు.... కొందరైతే కన్నీరు కార్చారు.

అందరూ కలసి ఖరీదైన కానుకలు కూడా యిచ్చారు రంగనాధంగార్కి.

మరో పరిస్థితిలో అయితే రంగనాధంగారు ఆ సత్కారానికి, అభిమానానికి, ఆప్యాయతకు ఎంతో ఆనందపడేవారు, మరెంతో గర్వపడేవారు.

కానీ రంగనాధంగారు ఆ క్షణంలో పడిన మనోవేదన వర్ణించడం ఎవరికైనా ఆశ్చర్యమే!

కారణం....ఆయనమీద పడిన వయసు బరువైనదని, ఆయనిప్పుడు కొంచెం పని చేస్తేనే అలసిపోతారని....ఆయనకు ఇంక సంపూర్తి విశ్రాంతి ఎంతైనా అవసరమని ఆయనను సర్వీసులోంచి రిటైర్ చేసింది ఆ డిపార్టుమెంట్....

మొదటి సారిగా మరికొన్ని రోజుల్లో తాను రిటైరైపోతానని గుర్తొచ్చిన క్షణం నుండీ మొదలైన బాధ ఇప్పుడు కొండంతై ఆయన్ని ఎంతగానో కృంగదీసింది.

ఆగని కాలంలో, ఓ క్షణంలో ఆతని చేతికి అందిన కాగితం గాలికి రెప రెప లాడుతూ ఆయన్ని వెక్కిరించింది....

అప్పుడు రంగనాధంగారి కాళ్ళు, చేతులు...

గుండె కొండంత బరువుగా అయిపోయింది....

అయినా ఏదీ ఆగలేదు....

రంగనాధంగారు రిటైర్ అయిపోయారు....

శాలువా, కానుక, పూల దండ అన్నీ వున్న సంచితో రంగనాధంగారు ఇంట్లోకి అడుగు పెడుతుంటే ఆయనకు ఏదో అనిపించింది....

ఈ విశ్వమంతా విచారం ఆయన్ని చుట్టి ముట్టింది....

ఈ భూగోళమంత బాధ గుండెలో నిండిపోయింది....

వంట గదిలోంచి బయటకు వచ్చిన భార్య లక్ష్మి ఆయనవైపు ఆదోలా చూసింది....

## తరం - అంతరం

ఎందుకంటే ఆమెకు తెలుసు రంగనాధంగారు ఈ రోజే రిటైరైపోతారని....అందుకే ఆమె ఇందాకటినుండీ అతని కోసమే ఎదురు చూస్తోంది....

కాసేపు ఆమె ఏమీ మాట్లాడలేకపోయింది ఎందుకో!

అది ఆతనంటే అలక్ష్యం, నిర్లక్ష్యం, చిన్న చూపు ఎంత మాత్రం కాదని ఆయనకి తెలుసు....అది ఒక అవ్యక్తానుభూతి....అందులో ఎవరైనా అంతే! ఎవరికైనా అంతే, ఎందుకో నోటి వెంట మాట రాదు కాసేపు....

రంగనాధంగారు చేతిలో సంచిని లక్ష్మికి అందించాడు.

ఆమె అందుకొని అందులో ఉన్న వాటిని చూసింది....ఆ తర్వాత జీవితంతో పోరాడి పోరాడి అలిసిపోయిన భర్త వైపు చూసింది....

రంగనాధంగారు కూడా భార్య వైపు చూసారు...

ఆయన కెందుకో తమ పెళ్ళి నాటినుండి తన జీవితంతో కలసిపోయి తనకు చేదోడు వాదోడుగా, తనకు ఎన్నో పరిస్థితుల్లో ధైర్యాన్ని, సలహాల్ని అందించిన భార్య అంటే....ఆ క్షణంలో విపరీతమైన ప్రేమ, అభిమానం, గౌరవం....ఆదో రకమైన కృతజ్ఞత.

లక్ష్మి మామూలుగానే కాఫీ అందించింది....

రంగనాధంగారి గుండెలో కోటి విషయాలున్నాయి ఆమెతో చెప్పడానికి. ...

ఆమె చెవులు ఆశతో ఎదురు చూస్తున్నాయి భర్త చెప్పేవి వినడానికి.

కానీ రంగనాధంగారు చెప్పలేకపోతున్నారు, ఆమె అడగలేకపోతుంది ..

ఆఖరుగా రంగనాధంగారు ఒక్క మాట అనగలిగేరు.....


"లక్ష్మీ! నేను రిటైరైపోయాను .. అంటే ఇప్పుడు నేను ఇదివరకటిలా డబ్బు సంపాదించలేను, ఏ పని చేయలేను... అప్పుడు నేను భర్త హోదాలో నీచేత అన్నీ చేయించుకొనేవాడిని ఇప్పుడు ఏమీ చేతకాని ఒక ముసలివాడిలా, నీమీద ఆధారపడే వ్యక్తిలా నీ చేత నాకు కావల్సిన పనిని బ్రతిమలాడి చేయించుకోవాలి... నా జీవితాంతం నువ్వు నాకు అండగా, చల్లని నీడగా, నిండైన తోడుగా ఉంటావా లక్ష్మీ?"

భర్త అలా మాట్లాడుతూంటే లక్ష్మి చలించిపోయింది.. ఆమె శరీరం కంపించిపోయింది ...

"ఏవండీ! ఏమిటా మాటలు? ఎందుకు మీరలా మాట్లాడుతున్నారు? మీకేం తక్కువండీ? మీకేం లోటండీ? ముత్యాల్లాంటి కొడుకు లున్నారు .వాళ్ళు మనల్ని ఎంతో ప్రేమతో చూసుకుంటారండి.. - మీరేదో ఆలోచించుకొని అలా మాట్లాడు-







తున్నారు... మీ నీడలో తలదాచుకొని, పసుపు, కుంకుమలతో మీ ఒడిలోనే ఆఖరి శ్వాస పీల్చాలని ఉందండీ నాకు!"

ఆమె కళ్ళ వెంట అప్రయత్నంగా కన్నీరు కారింది.....

రంగనాధంగారు చలించిపోయారు భార్య మాటలకు... .

"లక్ష్మీ! ఏడవకు.... రిటైరైపోయానన్న అదో రకమైన బాధతో ఏదేదో మాట్లాడి నిన్ను బాధ పెట్టాను.... ఏడవకు...." అని ఆమెను ఓదార్చారు.....

కానీ... ఆమె అన్న ఆ మాటల్లో అతనెప్పుడో మరచిపోయిన ఒక విషయం గుర్తుకొచ్చింది.... ఒకసారిగా అయనెంతో భయపడి పోయారు....

అతను ఘయపడుతున్నది అతని బ్రతుకు గురించి కాదు...ఒకప్పుడు తను అన్నమాట ఇప్పుడే తనకూ ఎదురౌతుందేమోనని...ఒకప్పటి తన అహంభావం, అనాలోచన, పరిస్థితుల్ని అర్థం చేసుకోలేని తనం, ఇవన్నీ తనకు ఎదురౌతాయేమోనని, అప్పుడు తను విజృంభించిన తీరులో ఇప్పుడు తనపై విజృంభిస్తాయేమోనని!....

రంగనాథంగారు ఆ క్షణంలో ఒక్కసారిగా కృంగిపోయారు....వడి వడిగా అడుగు లేసుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయారు.....

యధాప్రకారంగా పేపరు చదువుకోవడానికి వెళ్ళి ఉంటారేమోనని అనుకుంది లక్ష్మి!

కొంత సేపయ్యాక వేడ్నీళ్ళు చల్లారిపోతున్నాయి. స్నానానికి రండి అని ఆమె ఆ గదిలోకి వచ్చినప్పుడు రంగనాధంగారు ఆమె వైపు అసహనంగా చూసారు....

"ఇప్పు డేమీ చేయలేను....వెళ్ళు, వంట పని చూసుకో!" అని అన్నారు....

ఆమెకు ఏవీ అర్థంగాక అక్కడినుండి వెళ్ళిపోయింది....

అప్పటినుండీ రంగనాధంగారు అలా నిర్విరామంగా ఆలోచిస్తూనే ఉన్నారు....

తాళి కట్టడం ఒక్క క్షణమే అయినా ఆ క్షణం గురించి ఎన్నాళ్ళనుండో ఎదురు చూస్తాడు పెళ్ళి కెదిగిన యువకుడు....

పోవడం తప్పదని, అది ఒక క్షణంలో జరిగిపోతుందని తెలిసినా, పోయేవరకూ అలా ఆలోచిస్తూ భయపడుతూనే ఉంటాడు మంచంమీద పడి వున్న రోగి....

ఇప్పుడున్న పరిస్థితుల్లో....

ఆ మాటను వినడం తప్పదని....అది అనడానికి, వినడానికి కూడా ఒక్క క్షణం చాలని తెలిసినా, ఆ క్షణం తన జీవితంలో ఎదురవ్వక తప్పదని తెలిసినా...రంగనాథంగారు పదే పదే ఆ విషయం గురించి ఆలోచిస్తున్నారు....

మధ్య మధ్యలో ఆయన నవ్వుకుంటున్నారు....

జీవితం ఎంత చిత్రమైనది? మనిషి అన్న మాట, చేసిన పని, ఒకరికి కల్పించి చూపించిన సన్నివేశం గోడకు కొట్టిన బంతుల్లా తిరిగి తన మీదకే వస్తాయా?

ఇది అందరి విషయంలో నిజమౌతుందో లేదో గానీ, నా విషయంలో కొంతవరకు జరిగింది. జరగబోతుంది!

ఆలోచనల్లోని వాడి, వేడి వయసుతో ముడి పెట్టబడి ఉన్నాయా?

లేకపోతే అప్పుడు లేని ఆలోచనలు అప్పుడెందు కొస్తున్నాయి? అప్పుడు కలగని భయం అప్పుడెందుకు కలుగుతుంది?

వ్యక్తిగత జీవిత విషయాలకు సంబంధించిన ఆలోచనలు వయసు అనే ఒక బలమైన చట్రంలో బంధింపబడి ఉంటాయా?

ఏమో?!

ఉన్న పరిస్థితుల్ని బట్టి, నా ఆలోచనల్ని బట్టి నాకలా అన్పిస్తుందేమో?

ఏది ఏమైనా, నేను అనుకుంటున్నది, భయపడుతున్నదీ.... ఎదురవ్వక, జరగక, నన్ను వెక్కిరించక, నన్ను ఓడించక, హింసించక,.. నాకు, నాలాంటి వాళ్లకు ఒక పశ్చాత్తాపాన్ని కలిగించక మానదు!

గడియారం పది గంటలు కొట్టింది.

రంగనాధంగారు ఇంకా అలా ఆలోచిస్తూనే ఉన్నారు....

కిటికీలోంచి చల్లని గాలి రివ్వున వీస్తుంది....

అయినా అతని మెదడు వేడిగానే ఉంది....

కణతలు బలంగా రుద్దుకున్నారు....

అంతలో ప్రక్కనే ఎవరో కదిలినట్లు ఉలిక్కిపడి తల ప్రక్కకు త్రిప్పి చూసారు...

లక్ష్మి....

ఆయనే ఏందుకో తల దించుకున్నారు.....

"ఏమిటండీ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" అని అడిగిన ఆమె కంఠంలో ఆందోళన, ఆతృత మిళితమై ఉన్నాయి....

ఒక్క నిముషం ఆగి "నువొచ్చి ఎంతసేపయ్యింది?"

"ఇప్పటికి చాలాసార్లు వచ్చాను భోజనానికి లేవమవడానికి....కానీ....మీరు. .." మధ్యలోనే రంగనాధంగారు తలెత్తి భార్య వైపు చూసారు అదోలా....

"ఏమిటలా ఉన్నారు .? నాకు చెప్పగూడదా?"

ఆయన సమాధానం ఏమి ఇవ్వలేదు.. .

"చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నట్లున్నారు.... అదేమిటో నాక్కూడా చెప్పండీ!"

" ..లేదు లక్ష్మి! నేను ఆలోచించడం లేదు. భయ పడుతున్నాను... " భర్త మాటలకు ఆమె ఆశ్చర్యపోయింది. .

"ఎందుకు? రిటైరైపోయినందుకా?"

"పాలివ్వలేని ముసలి ఆవును కసాయికి అమ్మేస్తారు. .. పనిచేసే వయస్సై పోయిన వాడ్ని ఇంటికి పంపేస్తారు. అది సహజం నేను భయపడుతున్నది దాని గురించి కాదు...."

"మరి దేని గురించి? అసలు మీ రింతలా భయపడాల్సిన విషయం, అవసరం అస లేముంది?"

"అమ్మాయి పడుకుందా?"


"లేదు...ఆ చివరి గదిలో చదువుకుంటుంది...- చెప్పండి!"

"చెప్పడానికి ఏమీ లేదు లక్ష్మి! గతంలోని ఒక రోజు నాభవిష్యత్తును భయపిస్తుంది...."

"కాస్త అర్థమయ్యేలా చెప్పండి!" భర్త మాటల్లోని అర్థం ఏవీ అర్థంగాక అయోమయంగా అడిగింది ఆమె.....

"చెప్పడానికి అది చాలా చిన్న విషయం. ..! ఆలోచిస్తే, ఆ విషయాన్ని తలచుకుంటే గుండె బాధతో నిండిపోతుంది ..

'జీవితంలో ఎన్నో జరుగుతుంటాయి.... గతాన్ని గుర్తుకు తెచ్చుకున్నా, భవిష్యత్తును ఊహించుకున్నా.... కొన్ని విషయాలకు ఆనందం కలుగుతుంది.... కొన్ని విషయాలకు భయమేస్తుంది.... మీ రిందాకటినుండి భయపడుతున్నాను అని అంటున్నది దేని గురించి చెప్పండి?నాకు తోచింది



చెప్తాను... చేయ గలిగింది చేస్తాను... చెప్పుకుంటే కొంచెం మీ గుండె బరువైనా తగ్గతుందేమో కదా?"

రంగనాధంగారు కళ్ళ జోడు తీసి ప్రక్కనున్న బల్లమీద పెట్టి, (దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచి...." పిల్లలిద్దరూ ఇంకా రాలేదేమి?" అని అడిగారు.....

"ఏముంది? పెద్దవాడికి సెకండ్ షిఫ్టు కదా! రెండోవాడు ప్రైవేటుగా బి ఇ. కడుతున్నాడుకదా...- ఆఫీసునుండి వచ్చిన వెంటనే ఎవరో ఫ్రెండ్ దగ్గరకు చదువుకోడానికి గబ గబా వెళ్ళిపోయాడు.... వస్తే మరో గంట, అర గంటకి ఇద్దరూ వచ్చేస్తారు... మీరు భోజనం చేయగూడదూ, తర్వాత మాట్లాడుకుందాం!

"చేస్తాన్లే లక్ష్మీ! నా గుండె తేలికైన తర్వాత ఆకలి ఎలాగూ వేస్తుంది, అప్పుడు తింటాన్లే! మన ఇద్దరి అబ్బాయిల్తో రెండు ముక్కలు చెప్పాక తింటే తింటాను, లేకపోతే లేదు గానీ నువ్వలా కూర్చో లక్ష్మీ, నీకా విషయం చెప్తాను.....

లక్ష్మి అతనికి ఎదురుగా ఉన్న చిన్న స్టూలు మీద కూర్చుంది....

"అమ్మా! అమ్మా! తలుపు తియ్యమ్మా!"

"పెద్దవాడొచ్చాడు....వెళ్ళి తలుపు తియ్ లక్ష్మీ!"

రంగనాధంగారి గొంతు బొంగరు పోయింది....

లక్ష్మి బరువుగాలేచి వరండాలోకి వేళ్ళింది....

అంతవరకూ ఎలాగో ఆపుకున్న కన్నీరు లక్ష్మి అలా బయటకు వెళ్ళగానే ఒక్కసారిగా పైకుబికి పోయింది రంగనాధంగారి కళ్ళల్లోంచి....

గబ గబా తుడిచేసుకున్నారు....

కొడుకు తలుపు తట్టిన క్షణం నుండీ ఆలోచనలన్నీ కంగారు కంగారుగా, గజి బిజి అయిపోయి రంగనాధంగారిలో విపరీతమైన ఆందోళన ప్రారంభమయ్యింది.....

రంగనాధంగారి పెద్ద కొడుకు సూర్యం తండ్రి ఉన్న గదిలోకి వచ్చాడు.....ఆ వెనుక లక్ష్మి కూడా వచ్చింది.....

రంగనాధంగారు, లక్ష్మి ఒక్క క్షణం ఒకరి వైపు ఒకరు చూసుకున్నారు.

"నాన్నగారూ! మీ ఆఫీసులో జరిగిన ఫంక్షన్‌కు నేనూ వద్దామనుకున్నాను గానీ ముఖ్యమైన పని కావడంవల్ల రావటానికి వీలు కాలేదు ..ఆఖరుకు మా ఫోర్‌మెన్‌ను ఒక గంట పర్మిషన్ అడిగాను గానీ ఆయన ఇవ్వలేదు...ఏమీ అనుకోకండీ, ఫంక్షను విశేషాలేమిటి నాన్నగారూ!?" అన్నాడు సూర్యం....

"ఏముంటాయిరా? అంతా మామూలే! నువ్వెళ్ళి భోజనం చెయ్యి....తర్వాత మాట్లాడుకుందాం!" అన్నారు నెమ్మదిగాతెచ్చి పెట్టుకున్న నవ్వుతో..

"నాన్నగారూ! మీరు భోంచేసారా?"

"చేసేసాన్రా!" నువ్వెళ్ళి చెయ్యి.. ."

"అమ్మా! నేను స్నానం చేసి వస్తాను...ఇంతలో వడ్డించు" అని డ్యూటీ డ్రెస్ విప్పుతూ వెళ్ళిపోయాడు సూర్యం....

లక్ష్మి ఒక్క క్షణం అక్కడే నిలబడి .

"మీరు భోజనం చేయలేదు....చేయరా?"

"ఆకలిగా లేదు లక్ష్మీ, వాడికి వడ్డించు "

లక్ష్మి అక్కడినుండి నెమ్మదిగా కూతురు గదిలోకి వెళ్ళింది....

కూతురు సుజాత గుండెలమీద పుస్తకం పెట్టుకుని ప్రశాంతంగా నిద్రపోతుంది

లక్ష్మి కూతురువైపు చూస్తూ భారంగా ఓ నిట్టూర్పు విడిచి, సుజాత చేతిలోని పుస్తకాన్ని తీసి పక్కన పెట్టి, తొలగిన పైటను సర్ది లైటు ఆర్పేసి వంట గదిలోకి వెళ్ళింది....

అంతలో చిన్న కొడుకు రమేష్ వచ్చి తండ్రి గదిలోకి గబ గబా వెళ్ళాడు. "నాన్నగారూ!" అంటూ....

"ఏరా? పరీక్షలెప్పటినుంచి?

"ఎల్లుండినుండే నాన్నగారూ! అందుకే చదువుకోడానికి టైమ్ చాలదని మీ ఆఫీసులో జరిగిన ఫంక్షన్‌కు రాలేకపోయాను...ఏమీ అనుకోకండీ? ఫంక్షను విశేషాలేమిటి నాన్నగారూ!?"

"ఏముంటాయిరా? అంతా మామూలే! అన్నయ్య వచ్చాడు, వాడితో పాటూ నువ్వు భోజనం చేసిరా...- మాట్లాడుకుందాం!"

అలాగే నాన్నగారూ!" అంటూ ఆ గదిలోంచి బయటకు వేళ్ళిపోయాడు రమేష్ ...

రంగనాధంగారి దృష్టి మళ్ళీ కిటికీలోంచి బయటకు పోయింది....

ఇద్దరూ వేసినవి ఒకే ప్రశ్నలు.. .వాటికి నేను చెప్పినవీ ఒకటే సమాధానాలు ...

కానీ....విషయం విన్నాక వాళ్ళ ముఖాల్లోని భావాలు ఎలా వుంటాయో? అప్పుడు వాళ్ళ మాటలు ఎలా ఉంటాయో?

నేననుకున్నట్టుగా ఉంటాయో? లక్ష్మి అన్నట్టు ఉంటాయో?

కాలం మారుతుంది... మనుష్యులూ మారుతున్నాయ... ఈ తరంలోని నా కొడుకుల మాటలు నేనూహిస్తున్నట్టుగా ఉంటాయో? లక్ష్మి ఆశించినట్టుగా ఉంటాయో?

ఏమో!?

ఒక్కోసారి ఊహలకు, ఆశలకు...నిజాలకు పొంతన ఉండదు...

ఎలా అయినా, ఏమైనా భరించక తప్పదు... జరిగేవీ జరగక మానదు....

అలా రంగనాధం గారి ఆలోచనలు ఆగకుండా సాగిపోతూనేవున్నాయి...

గుండెలో బరువు పెరుగుతూనే ఉంది....

మనసు ఆలోచనల ఈదురు గాలికి రెప రెపలాడుతూనే ఉంది....


లక్ష్మి కొడుకులిద్దరికీ భోజనాలు వడ్డించి తింటూ వాళ్ళు ఏవేవో మాట్లాడుకుంటూ ఉంటే వాటిని ఆలకిస్తూ....మనసులో ఇందాక భర్త అన్న మాటలు, చెప్పిన విషయం వల్ల ఆమెలో కూడా చెలరేగిన ఆలోచనలను అదుపులోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తుంది....

ఇందాక ఆమె భర్త దగ్గర కొడుకులిద్దరిమీదా ఎంతో నమ్మకంగా మాట్లాడింది...అప్పుడు ఆమె కొడుకులమీద నమ్మకంతో అలా మాట్లాడినా, భర్తను ఓదార్చడానికి మాట్లాడినా...ఆమె మనసు కూడా ఓ మూల పీకుతూనే ఉంది....

కాలం, వయసు, పరిస్థితులవల్ల మనుష్యులు ఎప్పుడూ ఒక్కలాగే ఉండలేరు.. .ఈ కాలంలో, ఈ యవ్వనంలో, ఇటువంటి పరిస్థితుల్లో తన కొడుకులు తను ఆశిస్తున్నట్టుగా మాట్లాడుతారో, భర్త భయపడుతున్నట్టుగా చేస్తారో...ఆలోచిస్తుంటే ఆమెకూ భయమేస్తుంది....

కనీసం ఏ ఒక్కరైనా తను ఆశించినట్టుగా సమాధానం ఇవ్వరా అని కూడా ఒక మూల ధైర్యం తెచ్చుకుంటుంది....

కనీసం ఏ ఒక్కరైనా తను ఆశించినట్టుగా సమా-



ధానం ఇవ్వరా అని కూడా ఒక మూల ధైర్యం తెచ్చుకుంటుంది....

సూర్యం, రమేష్ ఇద్దరూ భోజనాలు చేయడం పూర్తయ్యింది...రమేష్ ప్రక్క గదిలోకి వెళ్ళాడు....

సూర్యం చేయి తుడుచుకుంటూ తల్లితో అన్నాడు..."ఏమిటమ్మా అలా ఉన్నావ్ ఈవేళ? అని....

"ఏం లేదురా..నాన్నగారు ఆ గదిలో ఉన్నారు...-మళ్ళా ఉదయం మీకు హడావుడి అయిపోతుం-దేమో...కాసేపు అవీ ఇవీ మాట్లాడండి...."

ఆమెకు ఏదో చెప్పాలని, భర్త అప్పుడు పిల్లలతో అనబోయే మాటలను వాళ్ళతో సూచాయగా చెప్పి వాళ్ళ అభిప్రాయాన్ని తెలుసుకోవాలని, ఆ అభి-ప్రాయంలో ఏమైనా అనుకోనివి, అనుమాన పడు-తున్నవి వినిపిస్తే వాటిని బ్రతిమలాడో, వాళ్ళ చేతులు పట్టుకొనో వాళ్ళనే మొదటి ఆ మాటలు భర్త చెవిన పడకుండా జాగ్రత్త పడాలని ఉంది గానీ ఆమె అంతకంటే ఎక్కువ మాట్లాడలేక-పోయింది....

"అలాగేనమ్మా! ఇదిగో వెళ్తున్నాను....ఒరే రమేష్...." అని పిలుస్తూ గదిలోకి వెళ్ళాడు. సూర్యం....

లక్ష్మి ఎంగిలి కంచాలను తీసి పెరట్లో పడేసి వంట గది శుభ్రం చేసి...చేతులు తుడుచుకుంటూ భర్త గదిలోకి వెళ్తున్నప్పుడే సూర్యం, రమేష్ కూడా ఆ గదిలోకి వెళ్ళాడు....

ఆమె నెమ్మదిగా కొడుకుల వెనుకే ఆ గదిలోకి వెళ్ళింది....

రంగనాథంగారు కిటికీలోంచి దీర్ఘంగా ఆలోచిస్తూ బయటకు చూస్తున్నారు....

లక్ష్మి పిల్లలిద్దరరివైపూ చూసింది ఒక్కసారి....

వాళ్ళ ముఖాలు ప్రశాంతంగా ఉన్నాయి....

"నాన్నగారూ! ఇప్పుడు చెప్పండి ఫంక్షను విషయాలు..." అని అన్నాడు సూర్యం...

రంగనాథంగారు ఉలిక్కిపడినట్టుగా తల ప్రక్కకు త్రిప్పి, 'ఇలా కూర్చోండిరా!" అని అక్కడున్న మడత మంచం చూపించారు....

సూర్యం, రమేష్ ఇద్దరూ కూర్చున్నారు...

రంగనాథంగారు భార్య వైపు చూసి కళ్ళతోనే అక్కడున్న స్టూలు మీద కూర్చోమని సైగ చేసారు ..

ఆమె కూడా కూర్చుంది....

రంగనాథంగారు చెప్పడం మొదలుపెట్టారు....

"ఫంక్షన్ బాగానే జరిగిందిరా.... అందరూ ఎంతో అభిమానంగా, బాధగా మాట్లాడారు.... ఎంతో గౌరవిరిచారు... ఏమైనా సర్వీసు పూర్తయి-పోయింది....

అని తల పైకెత్తి కొడుకులిద్దరివైపూ పరిశీలనగా చూశారు....

"....అంటే నేనింక ఏ పనీ చేయడానికి పనికిరానని తేలిపోయింది ." అన్నారు

ఆ మాటకు సూర్యం, రమేష్ ముఖాల్లో వచ్చిన చిన్న మార్పును గమనించపోలేదు రంగనాథం-గారు..

ఆ మార్పుకు అర్థం ఏమిటో, ఆ మాట వల్ల వాళ్ళ అంతరాల్లో చెలరేగిన ఆలోచన ఏమిటో మాత్రం తెలియలేదు రంగనాథంగార్కి...

రంగనాథంగారే మళ్ళీ మాట్లాడారు..

"ఒరే బాబూ! సూర్యం, రమేష్. మీకో విషయం చెప్పాలిరా...జాగ్రత్తగా వినండి. ." అన్నారు .

కొడుకులిద్దరూ తండ్రి వైపు ఆసక్తితో చూస్తూ "చెప్పండి నాన్నగారూ!" అన్నారు...

రంగనాథంగారు కొడుకులు అలా అడిగిన వెంటనే ఎంతో చెప్పాలని అనుకున్నారు గానీ.... అతనికి ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో, ఎలా మొదలు పెట్టాలో తెలియలేదు...

కారణం....

రంగనాథంగారు ఓ సాధారణ గుమాస్తా... అతని పని చేసే ఆఫీసులో ప్రొమోషన్లు ఆలస్యంగా రావడం రివాజు కావడంవల్ల ఆయన మరో సంవత్సరంలో రిటైరై పోతారనగా ఆయనకు యూడిసీగా ప్రమోషన్ వచ్చింది....

ఇన్నాళ్ళు ఆ ఇంటిని పోషించడానికి, సంఘంలో


# తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు గాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను గనుక పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారణకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివారాలను వ్రాయండి.

# దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించ లేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

# తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టుకు డై చెయ్యనవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడును చల్ల పరుస్తుంది. ఒక కోర్స్‌లో 3 ఫైల్స్ ధర రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**SHYAM AYURVED BHAVAN (AP)**
***P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105***



# ఆంధ్రసచిత్రవారపత్రిక

## చందా వివరములు

ది 21-9-84 సంచిక నుండి విడిప్రతి వెల రు.2/-

| | ఏజంటుద్వారా | పోష్టుద్వారా |
|---|---|---|
| 3 నెలలు... | రు. 26-00 | 27-95 |
| 6 నెలలు... | రు. 52-00 | 55-90 |
| 1 సంవత్సరము.. | రు.104-00 | 111-80 |

మనుష్యులుగా నిలబడడానికి కావల్సినవన్నీ సమకూర్చడానికి, పిల్లల చదువులు సక్రమంగా సాగడానికి అవసరమయ్యేవి అందించడానికి, బంధువులను భరించడానికి, సాంప్రదాయాలను పాటించడానికి. .ఇలాంటివి ఎన్నింటినో అతను తట్టుకోవడానికి అతని జీతమే కాదు, పెట్టుకోవచ్చున్న లోన్లుతో పాటూ ఎంతో అప్పు కూడా అయిపోయింది. ఇంకా రెక్కలు అలసిపోయి తెగిపోయే లోపుగా ఆయన తప్పని సరిగా నిర్వర్తించాల్సిన విధులు కొన్ని ఉన్నాయి....

ఆలోచించిన ప్రతిసారీ రంగనాథంగార్కి ఎంతో ఆశ్చర్యం వేసేది.... జీవితం ఈమాత్రంగా వెలగడానికి ధనం అనే ఇంధనాన్ని తనింత వెచ్చించాడా అని!

ఏ మనిషీ తను గడిపిన కాలంలో అయిపోయిన ప్రతి క్షణంలో... తనేమి చేసాడో, ఏవిధంగా మసిలాడో ఖచ్చితంగా చెప్పలేడు....

అలాగే ఏ మనిషీ జీవిత కాలంలో తను గడించిన ప్రతి పైసాను ఏవిధంగా ఖర్చు చేసాడో వివరంగా చెప్పలేడు....

జీవిత కాలం, సంపాదించిన డబ్బు అలాగే నిర్దిష్టమైన లెక్కలు లేకుండానే అయిపోతాయి....!

రంగనాథంగారు అందుకే ఎక్కువగా, వివరంగా ఎంతో చెప్పాలనుకున్నా ఏమీ చెప్పలేక పోతున్నారు. ..అసలు ఎలా మొదలు పెట్టాలో, ఏం మాట్లాడాలో తెలియడం లేదు అతనికి.....

కానీ అతి కష్టంమీద రెండు ముక్కలు మాట్లాడారు....

"ఒరే! నేను రిటైరైపోయాను...ఇన్నాళ్ళూ మిమ్మల్ని ఎలా పెంచానో, ఎలా పోషించానో, ఎలా చూసానో మీకు చాలావరకు తెలుసు.. . మీరడిగింది నా స్థోమత మేరకు అందించాను...మీరు వీలైనంత ఆనందంగా ఉండడానికే నేను ప్రయత్నించాను మిమ్మల్ని చదివించేను. . మీ తెలివి తేటల్తో మీరే ఉద్యోగాలు సంపాదించుకొని నాకు కొంత కష్టాన్ని తగ్గించేరు.. .అయితే ...."

"ఏమిటి నాన్నగారూ? మీరీ రోజు ఇలా మాట్లాడుతున్నా రేమిటి? మీరు మమ్మల్ని చూడలేదని, పైకి తీసుకు రాలేదని ఎవరన్నారు?" అన్నాడు సూర్యం. .

రంగనాథంగారు పెద్ద కొడుకు వైపు ఒక్క క్షణం చూసి ఆ తర్వాత భార్య వైపు చూసారు ..

ఆమె కూడా ఇందాకటి నుండి భర్త వైపే చూస్తుంది....

"బాబూ సూర్యం! నేను ఇవన్నీ చెప్పేది ఎవరో కాదన్నారని, అంటారని కాదురా! మీకు తెలుసా? నేను రిటైరై పోయే ముందు ఆఫీసులో నా వద్ద ఉన్న అన్నింటిని లెక్క ప్రకారంగా, జాగ్రత్తగా. ఏలోటు లేకుండా, ఏ బాకీ లేకుండా అప్పజెప్పేసాను ...- అప్పుడే వాళ్ళు నన్ను రిటైర్ చేసారు. .ఇప్పుడు, ఇంట్లో కూడా నా తర్వాత వాళ్ళైన మీకు అన్నీ అప్పజెప్పాల్సిన అవసరం ఉందిరా .కారణం





ఇప్పుడు నేను డబ్బు సంపాదించలేను ..కాబట్టి డబ్బుతో ముడి పెట్టబడి ఉన్న ఏ బాధ్యతనూ నేను నిర్వర్తించగూడదు. నేను కష్టపడ్డానో, సుఖపడ్డానో ఆ విషయాన్ని వదిలేయండి. , ఇప్పుడు నేను మోస్తున్న బాధ్యతల్ని నిజంగా నేను మోయలేను... మోయగలిగినా, మోయలేకపోయినా...మోస్తే నేను మోయాలి, లేదా మీరు మోయాలి.... అవునా?" ఆగి ఒక్కసారి చిన్న కొడుకు వైపు చూసారు....

"నాన్నగారూ! మీరు ఈ రోజు చాలా క్రొత్తగా మాట్లాడుతున్నారు....అసలు విషయం ఏమిటి నాన్నగారూ?" అన్నాడు రమేష్..

"అవును నాన్నగారూ? మీరు మాతో ఏదో చెప్పాలనుకుంటున్నారు కానీ

"సరిగ్గా, సూటిగా చెప్పలేక పోతున్నాను...- కారణం, అది నా అసమర్ధత ." రంగనాథంగారి దృష్టి ఏటో పోయింది

"అలా అనకండి నాన్నగారూ! మీరు అనుకుంటున్నది, చెప్పాలనుకుంటున్నది ఏమిటో చెప్పండి. "

"చెప్తానురా! అందుకే ఇంతవరకూ మీ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను. అయితే నేను చెప్పబోతున్నది బాధ్యత గురించి .అది చాలా బరువైనదని నాకు తెలుసు . దాన్ని మీరు మోయగలరో లేరో అని ఆలోచిస్తున్నాను.. "

సూర్యం, రమేష్ ఒక్క నిమిషం ఏమీ మాట్లాడలేదు...

తర్వాత సూర్యం అన్నాడు....

"అర్ధమయ్యింది నాన్నగారూ! మీరు ఆలోచిస్తున్న దేమిటో అర్ధమయ్యింది ..ఇన్నాళ్ళూ మీరు మోసిన బాధ్యతను మేము మోస్తాం ...- అప్పుడు మీ రొక్కరు...ఇప్పుడు మే మిద్దరం.. ఏరా రమేష్?"

"అవును నాన్నగారూ!"

కొడుకులు మాటలు విన్న రంగనాథంగారి గుండె ఆనందంతో ఎగిరిపోయినా...మళ్ళీ ఎందుకో కొద్దిగా మూలిగింది.....

వీళ్ళకు ఇంకా విషయం చెప్పలేదు...బాధ్యత అంటే అది ఒక చిన్న పదం అనుకుంటున్నారు గానీ అదేమిటో చెప్తే వాళ్ళు ఇలా, ఇంతలా మాట్లాడగలరా? చెప్పేస్తాను...అప్పుడేమంటారో చూస్తాను....

మళ్ళీ రంగనాథంగారు చెప్పడం మొదలు పెట్టారు....

"ఒరే! మీరన్న మాటలు నాకు నిజంగా ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయి....కానీ, ఒక్కసారి నేను చెప్పేది వినండి...అప్పుడు ఆలోచించి మనస్ఫూర్తిగా మాట్లాడండి..... అప్పుడు.... అప్పుడు నిజంగా సంతోషిస్తాను....ఈ తండ్రికి మీరు ఇద్దరైనా, మీ పిల్లలకు మీరు ఒకొక్కరేరా! జీవితంలోకి దూకుతున్నారు మీరు.... మీకు బాధ్యతలెన్నో ఉంటాయి.. వ్యక్తిగతంగా మీకు ఎదురవ్వబోయే బాధ్యతల్ని నిర్వర్తించే ముందు.. ఈ తండ్రి తను తన శక్తి మేరకు నిర్వర్తించగా మిగిలిపోయిన బాధ్యత్న మీ మీదకు నెడుతున్నాడు.... మరి వాటిని కూడా మీరు మోయగలరా?"

"అదేంటి నాన్నగారూ అలా అంటారు? ఇన్నాళ్ళు మీకు బరువైన బాధ్యతలమైన మేము ఇప్పుడు మా కాళ్ళమీద మేము నిలబడినప్పుడు మిమ్మల్ని, మీ బాధ్యతల్నీ స్వీకరించలేమా?"

"అవును నాన్నగారూ! మీ బాధ్యతలు మావి కావా? అయినా మీరు ఎక్కువగా ఆలోచిస్తున్నారు గానీ మన కుటుంబంలో ఉన్న కష్టాలు, మనకున్న బాధ్యతలూ చాలా తక్కువ నాన్నగారూ! చెల్లి పెళ్ళి చేసేస్తే ఇంక మనకేం బాధ్యత లున్నాయండి?"

రంగనాథంగారు చిన్నగా నవ్వారు .. ఆ నవ్వులో బాధ మిళితమై ఉంది... 'అసలైన విషయానికి దగ్గరగా వచ్చారు వీళ్ళు' అనుకున్నారు....

అందుకే ఆయన కొద్దిగా తడబడ్డారు ..అయినా ఆయన చెప్పడం ఆపలేదు .

"పెళ్ళి.. .అందులోనూ ఆడపిల్ల పెళ్ళి... ఆడపిల్ల పెళ్ళి చేయడం అంటే మీరసలు ఏమనుకుంటున్నారా? ఆరు నెలలుగా డబ్బు గడిస్తున్న మీకు మన కటుంబంలో ఉన్న కష్టాలూ, బాధ్యతలూ ఏం తెలుస్తాయిరా? తెలిసేలా నేను సంసారం చేస్తే మీ మనసులు, మీ చదువులు.. తద్వారా మీ జీవితాలు పాడవుతాయని మీకు నేనేమీ తెలిసేలా చేయలేదు. . సుజాత పెళ్ళికి నేను రిటైరవ్వగా వచ్చే డబ్బు సరిపోతుందని మీరు ఊహిస్తున్నట్టున్నారు... ఇక్కడే మీకు తెలియని విషయం ఒకటుందిరా... ఆ డబ్బుకి మరో పది వేలు కలిపితేనే గానీ . ఎలా చేసారూ, ఎందుకు చేసారూ అని మీరడిగే ప్రశ్నలకు సరిగ్గా సమాధానం చెప్పలేని... నేను చేసిన అప్పు తీరలేదురా! మీకు బాధ్యతల్ని, అప్పునీ తప్ప ఇంకేమీ ఇవ్వలేక పోయినందుకు నన్ను క్షమించగలరా?"

ఎంతసేపటినుండో గుండెలో బరువుగా ఉండిపోయిన మాట ఒక్కసారిగా పైకి అనేసరికి రంగనాథంగారి గుండె తేలికైపోయి గట్టిగా నిట్టూర్పు విడిచారు .

కానీ.. తేలికైపోయిన గుండె గబ గబా వణికిపోతుంది. విషయం విన్న కొడుకుల ముఖాలు, పలుకులు ఇప్పుడెలా ఉంటాయో అని....

లక్ష్మి ముఖంలో కూడా ఆలజడి ప్రారంభమైంది.....

కొడుకు లిద్దరూ ఒక్క క్షణం ఏమీ మాట్లాడలేదు....

"ఏరా మాట్లాడడం లేదు? ఆలోచిస్తున్నారా?"

"......"

"భయపడుతున్నారా?"

"........"

"ఆశ్చర్యపోతున్నారా?"

వాళ్ళ మౌనం రంగనాథంగారిలో కొద్దిగా ఉద్వేగాన్ని కలిగించింది ఎందుకో....

"అవును నాన్నగారూ! మేము నిజంగా ఆశ్చర్యపోతున్నాం....కొడుకుల భవిష్యత్తుకు, బలానికే కాదు....వాళ్ళ మానసిక పరివర్తనకు కూడా దోహదమయ్యే విషయాలను దృష్టిలో ఉంచుకుని పెంచే తండ్రు లెంతమంది ఈ సమాజంలో ఉంటారని ఆలోచించి ఆశ్చర్యపోతున్నామండి....నాన్నగారూ! మీరు విపరీతరగా ఆలోచిస్తున్నారని, ఆ ఆలోచనలు మీలో ఆందోళనను కలిగించి మీకు మనస్థాపాన్ని కలిగిస్తున్నాయని, మీరున్న పరిస్థితికి మేమేం జవాబు చెప్తామోనని, ఏమంటామోనని మీరు భయపడుతున్నారని మాకు అర్థమైంది....నాన్నగారూ! ఆలోచన మీ వయసుకు పెద్ద అనారోగ్యం....అందుకే మీ రింకేమీ ఆలోచించకండి.... నిశ్చింతగా ఉండండి...." అన్నాడు సూర్యం....

తన పరిస్థితిని పెద్ద విషమ పరిస్థితిగా తనను తానే చిత్రించుకొని కొడుకుల మనసులమీద అనుమానాన్ని పెంచుకొని ఆలోచనల తాకిడిని తట్టుకోలేక పోతున్న సమయంలో పెద్ద కొడుకు మాటలు విన్న రంగనాథంగారు ఈసారి నిజంగా ఆనందపడ్డారు....

లక్ష్మి ముఖంలో కూడా సంతోషం చోటు చేసుకుంది....

"అదేరా సూర్యం.... సాయంత్రం నుండీ ఇప్పటి వరకూ మీ నాన్నగారు ఇక్కడే కూర్చుని ఆలోచిస్తుంది అదేరా... తనేదో చేయలేదని. మీరు దాన్ని చేస్తానంటారో, చేయనంటారోనని ఒకటే ఆలోచించడం....ఆఖరుకు నేనన్నాను కూడా..... మీరు అలాంటి......"

"ఇంక ఊరుకోవే! నువ్వే గెలిచావని ఒప్పుకుంటున్నానుగా...." లక్ష్మి మాటను మధ్యలోనే ఆపేసి అన్నారు నవ్వుతూ రంగనాథంగారు....

"నాన్నగారూ! మీ రెప్పుడూ అలాగే నవ్వుతూ ఉండాలి.... మమ్మల్ని కూడా నవ్విస్తూ, మాకు ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో సలహాలనిస్తూ. .. ఇన్నాళ్ళు అలసి పోయిన మీ మనసును, తనువును ఈ చిన్న మొక్కల నీడల్లో విశ్రాంతి తీసుకోనివ్వండి.. ఆగనికాలంలో మేమూ ముసలి తండ్రులం కాకపోము అనే ఆలోచన గల మీ కొడుకుల మధ్య హాయిగా, సంతోషంగా ఉండండి ..మీ ఋణాన్ని కొద్దిగానైనా తీర్చుకోనివ్వండి.. మా కంతే చాలు

చిన్న కొడుకు మాటలకు రంగనాథంగారి హృదయంలో అణు వణువూ పులకించి పోయింది - మనసు దూది పింజిలా తేలికై పోసాగింది .

* * *

ఆ గదిలో బెడ్ లైట్ వెలుగుతోంది....

రంగనాథంగారు లక్ష్మి చెరొక మంచం మీద పడుకొని ఉన్నారు ..

"ఇప్పుడేమంటారు?"

"నువ్వే గెలిచావని అంటాను నువ్వు నీ పిల్లలకి పెట్టిన పాలలో నీ మనసును కలిపావని అంటాను...."

"మీరు ఎక్కువగా వాగుడుతున్నారు..

"లేదు లక్ష్మీ! ఈ రోజు నా జీవితంలో మరచిపోలేని రోజుల్లో ఒకటి. ...ఉదయంనుండీ రిటైరై పోతున్నానన్న దిగులు....తర్వాత చేతికి రాబోయే డబ్బు పిల్లలకు మిగల్చలేక పోతున్నాను అన్న బాధ..... కంటి కెదురుగా కనిపిస్తున్న బాధ్యతల్ని చూసి భయం....ఈ కాలం కుర్రకారుమీద ఏర్పరచుకున్న భావం చేసిన చిత్ర వధ.....తర్వాత... భరించలేనంత ఆనందం. విపరీతమైన సంతోషం, సంతృప్తి. . ఇంక నేను నిశ్చింతగా ఉంటాను...."

గడియారం పన్నెండు గంటలు కొట్టింది....

"ఇంక పడుకో లక్ష్మీ! చాలా టైమైంది.....మళ్ళా ఉదయం నుండీ నీకు పనే కదా....నీ ఉద్యోగానికి మాత్రం రిటైర్‌మెంట్ లేదు....

"కోడళ్ళొచ్చాక నేనూ రిటైరైపోతానండి"....


రంగనాథంగారు ఆ మాటకు నవ్వుతూ....దుప్పటి ముసిగేసారు....

ఈసారి ఆయనను మిగిలిపోయన ఒకే ఒక్క ఆలోచన నిలదీసి ప్రశ్నించింది.....

ఈతరంమీద నీకు నమ్మకం లేదు..... విపరీతమైన అనుమానం.....అంధుకేకదూ, నువ్వింందాకటి వరకూ భరించలేని గుండె కోతకు గురయ్యావు?

రంగనాథంగారు ఒప్పుకోడానికి సిగ్గు పడలేదు....

అవును....అందుకే నేను నిజంగా, మనస్ఫూర్తిగా ఓడిపోయానని ఒప్పుకుంటున్నాను .. ఒక తరంలోని




అందరి అంతరాలూ ఎప్పుడూ ఒకలాగే ఉండవు.. .నిజం చెప్పాలంటే తరం తర్వాత తరానికి తెలివి తేటలు, ఆలోచనలు, సంస్కారం ఇవన్నీ పెరుగుతున్నాయని అన్పిస్తుంది . నాకు.....మంచి చెడ్డల కలయిక అయిన ఒక తరం తర్వాత పుట్టిన మరో తరంలో మంచి పాలు పెరుగుతుందనే భావం నా కిప్పుడు కలుగుతుంది.....ఆ భావం నా కేంతో సంతోషాన్ని, సంతృప్తినీ కలిగిస్తుంది.....

మిగిలివున్న ఆ ఒక్క ఆలోచన కూడా పుటుక్కున తెగిపోయి రంగనాథంగారి గుండెను మరింత తేలిక చేసింది...

తన శరీరం ధృడంగా, రక్తం వేడిగా ఉన్న కాలంలో తన తండ్రి చరమ దశలోకి అడుగు పెట్టబోతున్న తరుణంలో ....తనను దగ్గరకు పిలిచి, కళ్ళలో కళ్ళు పెట్టి బేలగా చూసి...

"బాబూ! నేను నీ కింతకంటే ఏమీ ఇవ్వలేకపోయానురా... ఈ ఇంటిని ఇంత కాలం పోషించి, నిన్ను ఈమాత్రం చదివించేసరికి నా ఓపిక అయిపోయిందిరా... పెళ్ళి కెదిగిన చెల్లెల్ని, అయిదు వేలు అప్పుని నీ కప్పచెప్పి, నీ నీడలో నిల్చైనా కాలాన్ని గడుపుదామని అనుకుంటున్నందుకు నేను నిజంగా బాధ పడుతున్నాను....ఒక విధంగా సిగ్గు కూడా పడుతున్నాను.. నేను నీకు వదిలేస్తున్న బాధ్యతల్ని మోయగలవా బాబూ?... నన్ను క్షమించ గలవా బాబూ?"

....అని దీనంగా, దీనాతి దీనంగా చేతులు పట్టుకొని అప్పుడు, అలా తండ్రి తనను అడిగినప్పుడు.....

...తన రక్తం పొంగి పోయింది . కళ్ళల్లో ... జీరలు తేలిపోయి.... తండ్రి అంటే ఎంద... గుండె నిండా కసి పెరిగి పోయింది. .

. తండ్రి అడిగిన ఆ మాటకు తనప్పుడు అన్నట్టుగా, ఈ రోజు తన ముసలి వయసులో, చేతగానితనంలో తన తనయులు కూడా అలాగే. అప్పటి తనలాగే విరుచుకు పడితే..... అప్పుడు కుప్పలా కూలి పోయిన తండ్రి లాగే తను కూడా ఇప్పుడు గుండె పగిలిపోయి నేల కొరిగి పోవాల్సి వస్తుందేమో అనుకుని విపరీతంగా భయపడిపోయిన రంగనాథంగారు..

ఇందాక తను భయంగా, అనుమానంగా, విపరీతంగా ఆలోచించి, ఆగి ఆగి అడిగిన వాటికి, అన్న వాటికి కొడుకులు ఇచ్చిన సమాధానాలకు, అన్న మాటలకు . ముందు ఎంతో ఆశ్చర్య పడిపోయి తర్వాత ఆనంద పడిపోయి, ఇప్పుడు ధైర్యంగా గుండెలమీద చేతులు వేసుకొని పడుకో గలిగాడు

కొడుకుల మాటలు ఇచ్చిన సంతృప్తిలో ఆ దంపతు లిద్దరూ తాము భోజనం చేయ లేదనే విషయాన్నే మర్చి పోయి నిశ్చింతగా నిద్రలోకి జారిపోయారు □